క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు



విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి అర్చకులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, పూజలు, సాయంత్రం స్వామికి పల్లకిసేవ గావించారు.

ప్రసన్న విశ్వేశ్వరునికి రావణసేవ



రావణసేవలో స్వామివారు

ఇందుకూరుపేట : బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని మైపాడులో కొలువైన అన్నపూర్ణాంబ సమేత ప్రసన్న విశ్వేశ్వరునికి మంగళవారం రావణసేవ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాల నడుమ గ్రామ వీధుల్లో ఊరేగించారు. విద్యుత్ వెలుగులో ఊరేగుతున్న స్వామివారికి కొబ్బరికాయ, కర్పూర హారతులు అందజేసి స్వాగతం పలికారు. ఆలయ అర్చకుడు బండారు ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఉభయకర్తలుగా బొద్దుకూరు శ్రీనివాసులు, ప్రసన్న దంపతులు వ్యవహరించారు. ఉదయం చప్పర ఉత్సవం వేడుకగా జరిగింది. ఉత్సవాల సందర్భంగా గ్రామంలో కోలాహలం నెలకొంది.

పోస్టర్ ఆవిష్కరణ



బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించిన ఆర్డీఓ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడలో వెలసిన కామాక్షితాయి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం నెల్లూరు ఆర్డీఓ కార్యాలయంలో జరిగింది. ఆర్డీఓ మలోలా, ఆలయ ఈఓ గిరికృష్ణ కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించి, మాట్లాడారు. ఈనెల 28 నుంచి కామాక్షితాయి అమ్మవారి బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో దేవదాయశాఖ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి ప్రత్యేకం.. తాటిముంజెలు

- ఆరోగ్యానికి ఎంతో మేలు
- జోరుగా విక్రయాలు
- పలువురికి జీవనోపాధి



కోవూరులో తాటిముంజెలను విక్రయిస్తున్న వ్యాపారి

కోవూరు : తాటిచెట్టు నుంచి లభించే తాటిముంజెలకు వేసవిలో మంచి డిమాండ్ ఉంటుంది. తాటిచెట్టులోని అన్ని భాగాలు మనకు ఎన్నో రకాలుగా ఉపయోగపడుతున్నాయి. తాటాకులను ఇళ్ల పైకప్పుగా, విసన కర్రలుగా, తాటిముంజెలు, తాండ్ర, బెల్లం, కల్లు ఇలా ప్రతీది ఉపయోగపడేదే. వేసవి ఎండల తీవ్రత నుంచి ఉపశమనానికి ప్రకృతి ప్రసాదించిన వరం ఈ తాటి ముంజెలు. వేసవిలో తాటిముంజెలు తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుంది. వేసవి సీజన్‌లో మాత్రమే దొరికే వీటిని విక్రయిస్తూ ఎంతో మంది జీవనోపాధి పొందుతున్నారు. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు మాత్రమే దొరికే ఈ తాటిముంజెలు ప్రస్తుతం గ్రామీణ, పట్టణ ప్రాంతాలతో నిమిత్తం లేకుండా దారిపొడవునా లభిస్తున్నాయి. రోడ్డు పక్కన తాటిముంజెలను విక్రయానికి ఉంచగా గంటల వ్యవధిలోనే అమ్ముడుపోతున్నాయి.

రోడ్డు పక్కన విక్రయాలు

తాటిముంజెలు తరచూ దొరికేవి కావు. వేసవి కాలంలోనే ఇవి కాస్తాయి. ప్రస్తుతం వీటిని కోవూరు మండల కేంద్రంలోని పలు ప్రధాన ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. మండల కేంద్రంలో జోరుగా విక్రయాలు జరుగుతున్నాయి. మండలంలోని పలువురు యువకులు రోడ్డు పక్కన తాటిముంజెలు విక్రయిస్తున్నారు. మరి కొంతమంది ప్రధాన కూడళ్లలో అమ్ముతున్నారు. మండలంలో డజన్ తాటిముంజెలను రూ.70 నుంచి రూ.80 వరకు విక్రయిస్తున్నారు. ప్రతి రోజు సుమారు 50 నుంచి 70 డజన్లు విక్రయిస్తున్నట్లు వారు చెబుతున్నారు. తాటిముంజెలను గంపల్లో తెచ్చి తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. అందుకే తాటికాయలను అప్పటికప్పుడే కొట్టి విక్రయిస్తుండడంతో కొంచెం ధర ఎక్కువగా తీసుకుంటున్నారు.

అనేక పోషకాలు

వేసవి తీవ్రతలో మన శరీరానికి అవసరమయ్యే అనేక పోషకాలను కొబ్బరినీరుతో పాటు తాటిముంజెలు తిరిగి అందిస్తాయని వైద్యులు చెబుతున్నారు. వంద గ్రాముల తాటిముంజెలో 92.5 గ్రాముల తేమ, 9.4 గ్రాముల కార్బోహైడ్రేట్‌లు, 9.6 గ్రాముల ప్రోటీన్లు, 0.2 గ్రాముల పీచు పదార్థాలు, 0.1 గ్రాము కొవ్వు, 61 మి.గ్రా ఆమ్లం, 12 మి.గ్రా కాల్షియం, 21 మి.గ్రా పాస్పరస్, 0.3 మి.గ్రా ఇనుప దాతువు ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల వేసవి తాపం తీరడంతో పాటు శరీరానికి అవసరమైన కేలరీలు లభిస్తాయి. అంతేకాక వీటిని ముఖానికి ఫేస్ ప్యాక్‌గా కూడా ఉపయోగిస్తుంటారు. ఈ విధంగా చేస్తే ముఖంలో మొటిమలు, నల్ల మచ్చలు కూడా తగ్గుతాయని చెబుతారు.



విక్రయానికి ఉంచిన తాటిముంజెలు

తింటుంటే ఆ మజానే వేరు



వేసవిలో దొరికే తాటిముంజెలు తింటుంటే ఆ మజానే వేరు. గతంలో ఇవి గ్రామాల్లో మాత్రమే దొరికేవి. ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో కూడా దొరుకుతున్నాయి. వీటిని గ్రామీణ ప్రాంతాల నుంచి నెల్లూరుతో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రధాన కూడళ్లలో అమ్మకాలు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు.

– ఈదూరు వినయ్, కొవ్వూరు

బరువు తగ్గుతారు



తాటిముంజెలు తినడం వల్ల అధిక బరువు లేకుండా ఉంటారని వైద్యులు చెబుతున్నారు. గతంలో మా తాత పొలం నుంచి తీసుకొచ్చేవారు. వీటిలో నీటి శాతం అధికంగా ఉంటుంది. అంటురోగాలు కూడా చేరవని చెబుతారు. తాటిముంజెలను ఐస్ ఆపిల్ అని కూడా అంటారు.

– సీహెచ్ పాల్ రుపస్, కోవూరు

నియమావళి మేరకు పనులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

ముత్తుకూరు : ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున కొత్త పనులు మంజూరు చేసే పరిస్థితి లేదని, నియమావళి మేరకు మాత్రమే పనులు చేపట్టాల్సి ఉంటుందని ఎంపీడీఓ శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ పాత పనులకు సంబంధించి బిల్లులు విడుదల చేశామన్నారు. గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని కింది స్థాయి అధికారులను కోరారు. ఈ సమావేశంలో ఎంపీపీ గండవరం సుగుణ, వైస్ ఎంపీపీలు జయలక్ష్మి, చిన్నపరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జగదేవిపేటలో రైతు సదస్సు



విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ఇందుకూరుపేట : ఎస్వీ వ్యవసాయ కళాశాల బీఎస్సీ విద్యార్థుల ఆధ్వర్యంలో మండలంలోని జగదేవిపేటలో మంగళవారం రైతు సదస్సు జరిగింది. ఆర్ఏడబ్ల్యూపీ కార్యక్రమంలో భాగంగా జరిగిన సదస్సులో ఆత్మ డీపీడీ శివనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. క్షేత్రస్థాయిలో తెలుసుకునే విషయాలు విద్యార్థులకు భవిష్యత్తులో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులు వివిధ పంటలు, సాగు విధానాలు, మెళకువలు తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. వాటికి సంబంధించిన చిత్రపటాలు, నమూనాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ శివజ్యోతి, స్థానిక ఏడీఏ రాజ్‌కుమార్, కేవీకే సభ్యులు లోకేశ్, కిరణ్, ఏఈఓ వాగ్దేవి, వీఏఏలు నవీన్, సుమలత, నరేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వ్యవసాయశాఖ అధికారులు డేవీస్‌పేటలో భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించారు. మట్టి నమూనా ఆధారంగా పంటలు, ఎరువుల ఎంపిక చేసుకోవాలని కోరారు.

సింహ వాహనంపై కోదండరాముడు



కోవూరు : మండల కేంద్రమైన కోవూరులోని గాంధీ బొమ్మ సెంటర్‌లో వెలసిన కోదండరామస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారు సింహ వాహనంపై విహరించారు. గ్రామ వీధుల్లో ఊరేగిస్తున్న స్వామివారిని భక్తులు దర్శించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. తొలుత స్వామివారికి పల్లకిసేవ జరిపించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా భీమేశ్వరరావు, సుధా దంపతులు వ్యవహరించారు. ఆలయ ప్రధానార్చకుడు శ్రీకాంతాచార్యులు పూజా కార్యక్రమాలు జరిపించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పచ్చిరొట్టతో నాణ్యమైన దిగుబడి



మాట్లాడుతున్న ఏఓ వెంకటకృష్ణయ్య

విడవలూరు : వరిసాగుతో నాణ్యమైన, అధిక దిగుబడులు సాధించేందుకు పచ్చిరొట్ట పైర్లు ఎంతో ఉపయోగకరమని మండల వ్యవసాయాధికారి పి.వెంకట కృష్ణయ్య అన్నారు. మండలంలోని దంపూరు గ్రామంలో మంగళవారం ఆయన రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరిసాగుకు ముందు పచ్చిరొట్ట పైర్లను పొలంలో దమ్ము చేస్తే పైరుకు అవసరమైన సేంద్రియ పదార్థాలు అందుతాయని తెలిపారు. అదేవిధంగా పచ్చిపైర్లు అయిన జీలుగ, జనుము, పిల్లి పెసర, అలసంద, పెసర వంటి వాటిని ముందుగా పొలంలో దమ్ము చేసి, ఆ తరువాత వరినాట్లు వేసుకుంటే మంచి దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేంద్రరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రాయితీపై విత్తనాలు

మండలంలోని అన్ని రైతుభరోసా కేంద్రాల వద్ద పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏఓ పి.వెంకట కృష్ణయ్య తెలిపారు. కావాల్సిన రైతులు వారి పాసు పుస్తకం, ఆధార్ కార్డులను తీసుకుని రావాలని తెలియజేశారు. ఒక్కో రైతుకు ఐదు ఎకరాల వరకు మాత్రమే పరిమితం ఉంటుందని, 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట ఎరువులు అందిస్తామన్నారు.

వేడుకగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

పొదలకూరు : పెంచలకోన లక్ష్మీనరసింహస్వామి జయంతి సందర్భంగా మంగళవారం నృసింహుని కల్యాణాన్ని స్థానిక శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో వేడుకగా నిర్వహించారు. ఉభయకర్తలుగా నాగసూరి శ్రీనివాసులు–రజిని దంపతులు వ్యవహరించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య కల్యాణం కమనీయంగా జరిగింది. కల్యాణానికి హాజరైన భక్తులకు ముత్యాల తలంబ్రాలు అందజేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులు తప్పనిసరి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

తోటపల్లిగూడూరు : వరిసాగులో సమగ్ర పోషణ యాజమాన్య పద్ధతులు తప్పనిసరి అని మండల వ్యవసాయాధికారిణి శిరీషారాణి సూచించారు. మండలంలోని నరుకూరు, చిన్నచెరుకూరు గ్రామాల్లో మంగళవారం సమగ్రపోషణ యాజమాన్య పద్ధతులపై వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ వ్యవసాయంలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఇందులో భాగంగా లాభసాటి ఎరువుల ఎంపిక చేసుకోవాల్సిన బాధ్యత రైతులపై ఉందన్నారు. సాగుకు ముందు మట్టి పరీక్షలు చేయించుకుని ఎరువులను వాడాలన్నారు. వరిసాగులో రసాయనికి ఎరువులను అధికంగా వాడడం వల్ల భూసారం నశించి పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. రైతులు పచ్చిరొట్ట ఎరువులు, జీవన ఎరువులు వంటి సేంద్రియ ఎరువులను వినియోగించాలన్నారు. సేంద్రియ ఎరువులను ప్రోత్సహించడానికి వ్యవసాయ శాఖ ద్వారా 50 శాతం రాయితీతో పచ్చిరొట్ట ఎరువులను పంపిణీ చేస్తుందన్నారు. ఈ ఎరువులను సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ గ్రామ సహాయకులు శివకుమార్, నిరూష, పలువురు రైతులు పాల్గొన్నారు.

భూసారాన్ని పరిరక్షించుకోండి

- 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ లక్ష్మి

కొడవలూరు : భూసారాన్ని పరిరక్షించుకోవాలని ఏఓ సీహెచ్ఎస్.లక్ష్మి రైతులకు సూచించారు. 'పీఎం ప్రణామ్' కార్యక్రమంలో భాగంగా మండలంలోని నార్తురాజుపాళెంలో భూసార పరిరక్షణపై రైతులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులను సాగు చేయడం ద్వారా భూసారాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా పచ్చిరొట్ట విత్తనాలను 50 శాతం రాయితీపై పంపిణీ చేస్తున్నామన్నారు. జీలుగ, జనుము కిలో రూ.44, పిల్లి పెసర కిలో రూ.67 లకే అందిస్తున్నామని చెప్పారు. ఎడగారు వరిసాగు చేయని రైతులు సద్వినియోగం చేసుకుని భూమిని సారవంతం చేసుకోవాలని కోరారు. అనంతరం నానో యూరియా, నానో డీఏపీ, బయో ఫర్టిలైజర్స్ ఉపయోగాలను రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీఏఏ డి.శివజ్ఞాన, రైతులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరించిన సీఐ రాంబాబు

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానం వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను పొదలకూరు సీఐ ఆర్.రాంబాబు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ తన చేతుల మీదుగా దేవస్థానం వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల పోస్టర్లను విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈనెల 28 నుంచి వచ్చేనెల 3వ తేదీ వరకు మహోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం నిర్వహణ కమిటీ కార్యదర్శి వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎం.శ్యాంప్రసాద్, చొప్పా వెంకటేశ్వర్లు, శేఖర్, వెంకటేశ్వర్లునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక ప్రయోజనాలు



మాట్లాడుతున్న ఏఓ హరికరుణాకర్‌రెడ్డి

వెంకటాచలం : వ్యవసాయంలో రసాయన ఎరువులను తగ్గించి, సేంద్రియ ఎరువుల వాడకం పెంచితే అధిక ప్రయోజనాలు కలుగుతాయని మండల వ్యవసాయశాఖాధికారి హరి కరుణాకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చెముడుగుంట రైతు భరోసా కేంద్రంలో మంగళవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకం వల్ల తెగుళ్ల ప్రభావం అధికమై రైతులు నష్టపోతారని వివరించారు. అలాగే భూమి కూడా సహజ లక్షణాలు కోల్పోయి మొక్కలకు పోషకాలు అందించలేదని తెలియజేశారు. సేంద్రియ ఎరువులతో రైతుల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడుతాయని చెప్పారు.

నృసింహస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో నృసింహస్వామి

మనుబోలు : మండలంలోని లక్ష్మీనరసింహాపురం గ్రామంలో నృసింహస్వామి జయంతి వేడుకలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. అర్చకుడు వెంకట నాగమునుస్వామి వేకువజామునే నృసింహునికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం వేద మంత్రోచ్చారణల మధ్య సాంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు జరిపించారు. సాయంత్రం స్వామివారికి చందనాలంకారం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా ఉప్పలపాటి జగదీష్ వ్యవహరించారు.

ప్రజల ముంగిటకే వైద్యసేవలు



మనుబోలు : వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

మనుబోలు : రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య సురక్షతో వైద్యసేవలను సైతం ప్రజల ముంగిటకు తీసుకొచ్చిందని పీహెచ్‌సీ వైద్యులు పూజిత, మోహిసినా సుల్తానా అన్నారు. మండల కేంద్రమైన మనుబోలు సచివాలయం–2లో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో వారు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల చెంతకే వైద్యసేవలను తీసుకొచ్చేందుకే సీఎం జగన్ ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, దీనిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వైద్య శిబిరంలో 146 మంది రోగులు వైద్య సేవలను వినియోగించుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనరల్ మెడిసిన్ డాక్టర్ ప్రతాప్, అనస్తీషియన్ డాక్టర్ గాయత్రి, ఆప్తమాలజిస్ట్ కె.వెంకటలక్ష్మి, సూపర్‌వైజర్ ఎస్వీ రమణయ్య, ఫార్మసిస్ట్ పద్మకుమారి, టీఏ నజీమున్నీసా, ఏఎన్ఎంలు రాజేశ్వరి, సుభాషిణి, హెల్త్ అసిస్టెంట్ చంద్రశేఖర్, ఎంఎల్‌హెచ్‌పీ శ్రీరమ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష.. పేదలకు వరం

కోవూరు : జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజలకు వరం అని వైద్యాధికారి ఇర్ఫాన్ అన్నారు. కోవూరు మండలం పాటూరు పంచాయతీ పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామాంజనేయులు, ఈఓపీఆర్డీ నాగూర్, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, వైద్యులు వంశీకృష్ణ, మౌనిక, లక్ష్మీప్రసన్న, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



కోవూరు : వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఇర్ఫాన్

అన్నపై తమ్ముడి దాడి



గాయపడిన యానాదిరెడ్డి

పొదలకూరు : మండలంలోని బిరదవోలు పంచాయతీ కల్యాణపురం గ్రామంలో అన్నపై తమ్ముడు విచక్షణారహితంగా రోకలిబండతో దాడికి పాల్పడడంతో అన్న తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్సై డి.రామకృష్ణ కథనం మేరకు వివరాలు.. గ్రామానికి చెందిన వెన్నపూస యానాదిరెడ్డి అతడి తమ్ముడు పుల్లారెడ్డికి మధ్య కొంతకాలంగా వివాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో యానాదిరెడ్డిని పుల్లారెడ్డి దుర్భాషలాడుతుండగా ప్రశ్నించినందుకు అన్నపై రోకలిబండతో దాడికి పాల్పడ్డాడు. దీంతో యానాదిరెడ్డి తీవ్రంగా గాయపడగా ముందుగా స్థానిక సీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన చికిత్స నిమిత్తం 108లో నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.